25న బీసీల సమరభేరి



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

బర్కత్‌పుర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో ఈనెల 25న బీసీల సమరభేరి నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని, ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య సారథ్యంలో రవీంద్రభారతిలో సమరభేరి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్, జి.అనంతయ్య, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు

బీసీలకు అన్ని రంగాల్లోనూ అన్యాయం జరుగుతోంది

రాంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనాభాలో సగానికి పైగా బీసీలున్నా.. వారికి అన్ని రంగాల్లోనూ అన్యాయం జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, బీసీ కుల సంఘాల చైర్మన్ కుందారం గణేషాచారిలు అన్నారు. వివిధ కులాల వారీగా జనాభాను బట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీసీ డెడికేషన్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావును కలిసి బీసీలు, గౌడ్స్‌లకు న్యాయంగా రావాల్సిన హక్కులపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీల హక్కులను కాలరాసిందని వారు ఆరోపించారు. చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు వచ్చేంత వరకూ తమ పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంతోష్ మహరాజ్ తదితరులు

కవాడిగూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం తెలంగాణలో నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందజేయాలని, కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని ధర్మసమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కో కన్వీనర్ సంతోష్ మహరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌మహరాజ్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌పీ నేతలు మనోజ్ కుమార్, శ్రీధర్ శివకుమార్, పవన్ గణేశ్, శ్రవణ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులందరూ కలిసికట్టుగా పని చేయాలి



సభలో మాట్లాడుతున్న వరప్రసాద్

రాంనగర్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రగతిపథంలో నడిపించేందుకు ఉద్యోగులందరూ కలిసికట్టుగా పని చేయాలని హైదరాబాద్ రీజియన్ మేనేజర్ బి.వరప్రసాద్ సూచించారు. ఆజామాబాద్‌లోని ముషీరాబాద్ డిపో ఆవరణలో మేనేజర్ టి.కిషన్‌రావు ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రగతి రథ చక్రం అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లకు అత్యధికంగా ఆయిల్ ఆదా చేసిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చార్మినార్ రీజియన్ డిప్యూటీ మేనేజర్ బాబునాయక్, రీజినల్ మేనేజర్ మెకానిక్ విభాగం జగన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న టి.రఘు

బర్కత్‌పుర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు ఉత్తమ బస్‌స్టేషన్ అవార్డు లభించింది. దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోలో జరిగిన టీజీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ ప్రగతి చక్ర పురస్కార ప్రదానోత్సవంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఆర్టీసీ రిజినల్ మేనేజర్ వరప్రసాద్ చేతుల మీదుగా కాచిగూడ డిపో మేనేజర్ టి.రఘు అవార్డును అందుకున్నారు. ప్రశంస పత్రంతో పాటు 5 వేల రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సుచరిత, జగన్, బాబునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం నిరాహారదీక్ష నేడు

రాంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ఆర్టికల్ 341 జీవోను సవరిస్తూ పార్లమెంట్ బిల్లు ఆమోదింపచేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో ఈనెల 21న బర్కత్‌పురలోని సామాజిక భవనంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు కూటమి అధ్యక్షుడు పోకల కిరణ్‌మాదిగ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వర్గీకరణ ప్రక్రియ ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు



కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్

ముషీరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫారంలో బుధవారం ఉదయం 7.30 గంటలకు మంటలు వెలువడి దగ్ధమైంది. స్థానికులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ట్రాన్స్‌ఫారం చుట్టూ చెత్త చెదారం ఉండడం వల్ల చెత్తకు మంటలు అంటుకుని ట్రాన్స్‌ఫార్మర్‌కు వ్యాపించడంతో అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. సకాలంలో మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు విజయభాస్కర్, వినోద్‌కుమార్ తెలిపారు. సీఈ కాలనీ పరిధిలోని శివం, సరళానగర్, సాయిబాబా నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, బతుకమ్మకుంట పరిధిలోని పాములబస్తీ, మల్లన్నటెంపుల్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30 గంటలు, సంజీవయ్యనగర్ పరిధిలోని తిలక్‌నగర్, మీసేవ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30, శివాలయం పరిధిలోని బాలాజీ ఆర్కేడ్, వెజిటబుల్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో 3 నుంచి 5 వరకు సరఫరా ఉండదన్నారు. ఏపీపీఎస్సీ, అజంతా గేట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు, నిజామ్‌కాలేజ్, రోజరీ కాన్వెంట్ పరిధిలోని ప్రాంతాల్లో 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

బర్కత్‌పుర, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేని తొమ్మిదో తరగతి విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మోతి మార్కెట్‌లో నివాసముంటున్న సీహెచ్.శివ కుమారుడు గణేష్(14) చాదర్‌ఘాట్‌లోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్ల క్రితం ఈ బాలుడికి అపెండెక్స్ ఆపరేషన్ అయింది. మూడు రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యులకు చూపించినా కడుపునొప్పి తగ్గలేదు. నొప్పి భరించలేక గణేష్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

రోగులకు యోగా

రోజూ చేయిస్తామంటున్న ప్రభుత్వాస్పత్రి వైద్యులు



భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో యోగా చేయిస్తున్న వైద్యులు

ముషీరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారికి వైద్య సేవలు అందించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందేలా యోగా చేయిస్తామంటున్నారు వైద్యులు. ముషీరాబాద్ ప్రధాన రోడ్డులోని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో నేషనల్ ఆయుష్ మిషన్ (ఎన్‌ఏఎం) ఆధ్వర్యంలో బుధవారం నుంచి వైద్యంలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు యోగా చేయిస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని చిక్కడపల్లి హోమియోపతి ఆసుపత్రి సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తూ సంపూర్ణ ఆరోగ్యం పొందేలా చర్యలు చేపట్టారు. యోగా చేయించేందుకు దీపలత, నితిన్ యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. వీరు ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రతిరోజూ అరగంట నుంచి ఒక గంట సమయం యోగా చేయిస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి..

ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందే వారితో పాటు గర్భిణులు సాధారణ డెలివరీ అయ్యే విధంగా యోగా, బాలింతలకు నడుమునొప్పి, వెన్నునొప్పి తదితర నొప్పులతో బాధపడుతున్నవారికి, వృద్ధులకు యోగా ఇన్‌స్ట్రక్టర్లు యోగా చేయిస్తున్నారు. భవిష్యత్‌లో యోగాలో మరిన్ని సేవలు అందించేందుకు వైద్యులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజల నుంచి మంచి స్పందన



రోగులతో యోగా చేయిస్తుండడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అరగంట నుంచి గంట పాటు యోగా చేయిస్తున్నాం. మంగళవారం ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ డెలివరీ అయ్యేలా యోగా ఉపయోగపడుతుంది.

\- డాక్టర్ మనోజ్‌రెడ్డి, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి

ప్రతిరోజూ యోగా



ఆసుపత్రికి వచ్చే రోగులతో ప్రతిరోజూ యోగా చేయిస్తున్నాం. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా ఇద్దరు యోగా నిపుణులను అందుబాటులో ఉంచి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సైతం యోగా చేయిస్తున్నాం. ఆస్తమా, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యంతో పాటు యోగా చేయిస్తున్నాం.

\- డాక్టర్ అలివేలుమంగ, చిక్కడపల్లి హోమియోపతి వైద్యాధికారిణి

ఆసుపత్రిలో ఇలాంటి సేవలు భేష్



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యంతో పాటు యోగా చేయిస్తూ మెరుగైన సేవలు అందించడం అభినందనీయం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు యోగా చేయిస్తూ ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్దుతున్నారు.

\- పి.శ్రీధర్‌చారి, ముషీరాబాద్ స్థానికుడు

పాత నేరస్థుల అరెస్ట్

ఒక ఆటో, నాలుగు బైక్‌లు, మొబైల్ ఫోన్లు రికవరీ

చిక్కడపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పాతనేరస్థులను చిక్కడపల్లి క్రైమ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆటోతో పాటు నాలుగు బైక్‌లు, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఇ.శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 9వ తేదీన రాత్రి ఏడు గంటల సమయంలో చిక్కడపల్లి మెయిన్‌రోడ్‌లోని సాయిబార్‌కు తన అద్దె ఆటో (టిఎస్13 యుఎ 6114)లో వెళ్లిన ఎ.ప్రేమ్ రాత్రి తొమ్మిదిన్నరకు తిరిగి వచ్చాడు. పార్క్ చేసిన తన ఆటో కనిపించకపోవడంతో అన్ని చోట్లా వెతికాడు. అపై 12వ తేదీన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మౌనిక నేతృత్వంలో క్రైమ్ బృందం దర్యాప్తు చేపట్టారు. దాదాపు 30 సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించారు. ఈ క్రమంలో ఆటో చోరీకి పాల్పడ్డ పాత నేరస్తులైన కురుమ రాజు(30), చాకలి బాల్‌రాజు(36)ల కదలికలపై కన్నేసి బుధవారం వారిని చిక్కడపల్లిలో అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎ-1 కురుమ రాజు నగరంలోని పలు పీఎస్‌ల పరిదిలో ఆరు కేసుల్లో నిందితుడు. కాగా ఎ-2 చాకలి బాలరాజు నగరంలోని పలు పీఎస్‌ల పరిదిలో 25 కేసుల్లో నిందితుడు. 2016లో ఎస్‌ఆర్‌నగర్ పీఎస్ పరిధిలోని కేసులో అతడిపై పీడీ యాక్ట్ కూడా నమోదయింది.

లా విద్యార్థులు న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి

సిటీ సివిల్ కోర్టు 20వ జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సాయికిరణ్ కసమాల

రాంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లా, ఎల్ఎల్‌ఎం విద్యార్థులు న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు కృషి చేయాలని సిటీ సివిల్ కోర్టు 20వ జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ సూచించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో లా, ఎల్ఎల్‌ఎం విద్యార్థులకు ఓరింటేషన్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ సాయికిరణ్ కసమాల మాట్లాడుతూ.. ఎల్ఎల్‌ఎం చదివిన విద్యార్థులకు నేడు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ కోర్సులు చదివే విద్యార్థులు అధ్యాపకుల బోధన, వారు ఇచ్చే సలహాలను పాటిస్తూ న్యాయ వ్యవస్థలోని చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ప్రతి న్యాయ కళాశాల న్యాయ విద్యార్థులకు ఓరింటేషన్ సదస్సులు నిర్వహించాలన్నారు. ఓయూ సీఎల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక యాదవ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు జి.వెంకటస్వామి స్థాపించిన డాక్టర్ అంబేద్కర్ విద్యా సంస్థలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, డైరెక్టర్లు విష్ణుప్రియ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'సదర్ ఉత్సవాలతో యాదవుల్లో ఐక్యత'



ఎడ్ల హరిబాబుయాదవ్‌ను సన్మానిస్తున్న బాలప్పాయాదవ్ తదితరులు

ముషీరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సదర్ ఉత్సవాలు యాదవుల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు తమ వృత్తిని కాపాడుకునేందుకు దోహదపడుతున్నాయని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ అన్నారు. సదర్ ఉత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఎడ్ల హరిబాబుయాదవ్‌ను అభినందిస్తూ నారాయణ్‌పేట్ యాదవసంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బాలప్పాయాదవ్ మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు యాదవుల వృత్తిని, ఐక్యతను చాటి చెప్పేలా ప్రతియేటా సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 25న నారాయణ్‌పేటలో జరిగే సదరు ఉత్సవాలకు హరిబాబు యాదవ్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణ్‌పేట్ యాదవ సంఘం కన్వీనర్ రఘువీర్ యాదవ్, తిరుపతి, గోపాల్, కృష్ణ, చిన్నయ్య, శ్రీనివాస్, కేశవులు, వెంకటప్పా పాల్గొన్నారు.

1400 కిలోల అల్లం వెల్లుల్లి మిశ్రమం సీజ్



అధికారులు సీజ్ చేసిన అల్లం వెల్లుల్లి మిశ్రమం

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో కల్తీ అల్లం వెల్లుల్లి మిశ్రమం తయారీ జోరుగా కొనసాగుతోంది. పరిమిత స్థాయిలో అల్లం, వెల్లుల్లి వాడుతూ.. సింథటిక్ రంగులు, సిట్రిక్ యాసిడ్, ఇతరత్రా పదార్థాలు అల్లం వెల్లుల్లి మిశ్రమంలో కలుపుతున్నారు. కాటేదాన్‌లో తెలంగాణ కమిషనర్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. అక్కడి ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థలో 1000 కిలోలు, ఉమాని ఫుడ్స్ ఇంటర్నేషనల్‌లోనూ 400 కిలో ప్యాకేజ్డ్ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, రంగు వచ్చేలా ఈ మిశ్రమంలో కలిపేందుకు ఉంచిన 50 కిలోల సింథటిక్(టాట్రజైన్) రంగులనూ స్వాధీనం చేసుకున్నారు. మిశ్రమం తయారు చేస్తోన్న కేంద్రాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గ్రైండింగ్, వాష్ ఏరియా వద్ద నీటి నిల్వలు, తయారీ, స్టోరేజ్‌లో కనీస ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారు. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిన అధికారులు.. రెండు తయారీ కేంద్రాలను సీజ్ చేశారు. అనుమతులు రద్దు చేవామని, చట్ట ప్రకారం తదుపరి చర్యలుంటాయని పేర్కొన్నారు. బోర్డులు లేకుండా అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తోన్న సంస్థ.. ప్లాస్టిక్ డబ్బాల్లో ప్యాక్ చేసి విక్రయిస్తున్నాయి.

● **ఆనంద్‌బాగ్‌లో..**

జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఆధ్వర్యంలో బుధవారం ఆనంద్‌బాగ్‌లోని మురుగన్ హోటల్, కాకతీయనగర్‌లోని శ్రీ తిరుమల బేకరీలో జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీ చేశారు. హోటల్, బేకరీలో అపరిశుభ్ర వాతావరణం ఉందని గుర్తించి.. జీహెచ్ఎంసీ యాక్ట్ 1955 ప్రకారం ట్రయల్ కేసులు నమోదు చేశారు.

పీఎం విశ్వకర్మ యోజన రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఆశన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆశన్న

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి ప్రాతిపదికన అసంఘటిత రంగంలో చేతులు, పనిముట్లతో పనిచేసేవారు ప్రధానమంత్రి విశ్వకర్మయోజన కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ కులసంఘాలు, ఎన్జీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు, పనిముట్ల వృత్తిదారుల నుంచి కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతుందని తెలిపారు. ఈ పథకం కింద లక్ష రుణం ఐదు శాతం వడ్డీపై ఇస్తుందని, దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణివ్వడం, ఆ సమయంలో స్టయిఫండ్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని తెలిపారు. లక్ష రూపాయల రుణం 18 నెలల్లో తిరిగి చెల్లించిన వారికి మళ్లీ రూ.2లక్షల రుణమిస్తామని తెలిపారు. దరఖాస్తుదారుడు చేతివృత్తులు, పనిముట్లతో పని చేస్తూ కుటుంబ సాంప్రదాయ పద్ధతులలో నిమగ్నమైన హస్త కళాకారులు, వృత్తి కళాకారులు పీఎం విశ్వకర్మ పథకానికి అర్హులని, రిజిస్ట్రేషన్ చేసుకునే నాటికి లబ్ధిదారుల వయస్సు కనీసం 18 ఏళ్లు ఉండాలన్నారు. ఈ పథకం కింద కుటుంబంలో ఒకరికి మాత్రమే రిజిస్ట్రేషన్ పరిమితమని, అర్హత కలిగిన కుల వృత్తులవారు కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి https://pm vishwakarma.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సర్వే ఆఫీసర్ వి.శ్రీరామ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియజ్ అహ్మద్, జిల్లా సహాయ అభివృద్ధి అధికారులు టి.నరసింహులు, డి కృష్ణమాచారి వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ పళని కదిరవన్

చిక్కడపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్ పళని కదిరవన్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. అనంతరం పళని కదిరవన్ మాట్లాడుతూ.. ప్రజలకు విజ్ఞానాన్ని అందించే విధంగా గ్రంథాలయాలను తీర్చిదిద్దడంలో ఉద్యోగులు తమ విధులను అంకితభావంతో నిర్వహించడమే కారణమన్నారు. రిటైర్డ్ అయిన గ్రంథాలయాల ఉద్యోగులను సన్మానించడం అంటే ఎంతో ముఖ్యమైన అంశమని వారి సేవలను అభినందించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ, కొక్కుల దేవేందర్, తుమ్మ సత్యనారాయణ, శాగంటి అయోధ్య, బొల్లం మహేందర్, నరేందర్, సుఖేష్‌కుమార్, జానకిరాములు, విశ్వనాథం, జగన్మోహన్‌రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సంస్కరణ కోసం చింతామణి నాటకం



రోశిరెడ్డిని సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాహిత్యాన్ని అస్త్రంగా వాడుకుని నాటి సామాజిక వ్యవస్థలో రుగ్మతలు తొలగించేందుకు రచయితలు, కవులు, కళాకారులు కృషి చేశారని ప్రముఖ సినీ రచయిత బుర్ర సాయిమాధవ్ పేర్కొన్నారు. అదే తరహాలో కాళ్ళకూరి నారాయణ రావు చింతామణి నాటకం సామాజిక సంస్కరణకోణంలో రచించారని ఆయన తెలిపారు. అనంతర కాలంలో కొందరు ద్వంద్వార్థాలు నాటకంలో చొప్పించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గణేశ్ కళానికేతన్ తృతీయవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో భక్త చింతామణి నాటకాన్ని ప్రముఖ నటుడు ఎస్.రోశిరెడ్డి సారథ్యంలో అద్భుతంగా ప్రదర్శించారు. చింతామణిగా రత్నశ్రీ, పూలరంగడుగా రోశిరెడ్డి, శ్రీహరిగా రవిచంద్రరెడ్డి, బిల్వమంగళుడుగా లక్ష్మణ్‌రాజు, చిత్రగా దేవి, దామోదరుడుగా దొంతి జంగయ్యగౌడ్‌లు నటించి ప్రేక్షకులను ముగ్ధులను చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐఏఎస్ రిటైర్డ్ అధికారి డా.కేవీ రమణాచారి పాల్గొని రోశిరెడ్డి నాటకరంగంలో స్వర్ణోత్సవం సందర్భంగా ఆయనను సత్కరించి మాట్లాడారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి నాటకాన్ని మాత్రం జీవితంగా భావించిన రోశిరెడ్డి పట్టుదల, అంకితభావం ప్రశంసనీయమన్నారు. ప్రేక్షకుల ప్రశంసలు వారికి కడుపు నిండిన అనుభూతిని పొందుతారన్నారు. కళాపోషకుడు కాటం శివారెడ్డి మాట్లాడుతూ రోశిరెడ్డి జీవితం కష్టాలమయం అయినా నాటకాన్ని ఆయన వదలలేదని వివరించారు. కవి రాజగోపాల్ అధ్యక్షత వహించిన సభలో రఘురామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మనసుకు హత్తుకున్న ప్రేమ కథాకావ్యం ప్రియసఖి



నాటకంలోని ఓ దృశ్యం

చిక్కడపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రియసఖి నాటక ప్రదర్శన మనసుకు హత్తుకునేలా ప్రదర్శించారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శివాలయంలో నిర్వహించిన ఈ నాటక ప్రదర్శనను జయాఆర్ట్స్ హైదరాబాద్ వారు పర్యవేక్షించారు. డా.శ్రీజ సాధినేని రచించి దర్శకత్వం వహించడమే కాకుండా రెండు ముఖ్య పాత్రల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. శశిధర్ ఘణపురం, అవినాష్, పవన్‌రాజు, సందీప్ దేశ్‌పాండే, జ్యోతి వివిధ పాత్రలు పోషించి నాటక ప్రదర్శనను రక్తికట్టించారు. పంజాబ్‌లో జరిగిన నిజమైన ప్రేమకథల ఆధారంగా డా.శ్రీజ సాధినేని రచించిన ఈ ప్రేమ కథాకావ్యం ప్రేక్షకులచే కంటతడి పెట్టించడం విశేషం. కళాభిమానులు పాల్గొని ప్రదర్శకులను, నిర్వాహకులను అభినందించారు.

మహిళ అదృశ్యం

బర్కత్‌పుర, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): ఊరికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ మహిళ బుధవారం అదృశ్యమైంది. కాచిగూడ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన బిలాదర్ పాండ్రే మహేష్ భార్య నాగు(21)తో కలిసి నింబోలి అడ్డలోని శ్రీ సాయి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. నాగు బీదర్‌కు వెళ్తున్నట్లు బుధవారం భర్తకు చెప్పి వెళ్లింది. రాత్రి వరకు ఆమె బీదర్‌కు చేరుకోలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. దీంతో ఆందోళన చెందిన మహేష్ కాచిగూడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటి సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్



తాళ్లబస్తీలో సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

కవాడిగూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని రాజ్యసభసభ్యుడు మండడి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు, కొన్ని ప్రాంతాల్లో ప్రతిపక్ష నేతల మాటలు విని సర్వేలో వివరాలు చెప్పలేని వారు సైతం వివరాలు చెప్పేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. సర్వే పనితీరును పర్యవేక్షించేందుకు బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని తాళ్లబస్తీలో జరిగిన సర్వే జరుగుతున్న ప్రాంతాన్ని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ఆకస్మికంగా పర్యవేక్షించి సర్వే జరుగుతున్న వివరాలు అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు, కార్యక్రమంలో రమేష్‌యాదవ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు పి.ధర్మేందర్, సంగపాక వెంకట్, కిట్టు, మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాము, రమేష్, నోడల్ అధికారి మధు పాల్గొన్నారు.

సర్వేకు అంబర్‌పేట సర్కిల్‌లో మంచి స్పందన

రాంనగర్: కుటుంబ సర్వేకు అంబర్‌పేట సర్కిల్‌లో మంచి స్పందన లభిస్తోందని సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్ తెలిపారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో నివాసం ఉంటున్న ఐఏఎస్ విశ్రాంత అధికారి చిరంజీవులు ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. డీఎంసీ మాట్లాడుతూ అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ఈ నెలాఖారు వరకు సర్వే పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. సర్వేకు ప్రజలందరూ జీహెచ్ఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. సర్వేకు ఐఏఎస్ విశ్రాంత అధికారి చిరంజీవులు అన్ని వివరాలు తెలియజేశారని ఆయన తెలిపారు.

● **నియామకం**



తెలంగాణ బీసీ స్టూడెంట్ అసోసియేషన్ రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా పుట్టం శివను నియమించారు. ఈ మేరకు బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కార్యక్రమంలో నియామకపత్రం అందజేశారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి